
ప్రభాత సమాచారం
https: epaper.prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శనివారం | 10 జనవరి 2026 | ■ 11 పేజీలు



# సీనియర్ పాత్రికేయుడు రెహమాన్ ఇకలేరు

సీనియర్ పాత్రికేయుడు, రచయిత, ఉపాధ్యాయుడు, 'ప్రతిపక్షం' దినపత్రిక సంపాదకుడు మహమ్మద్ ఫజుల్ రెహమాన్(66) ఇకలేరు. గత ఆరు రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో అపస్మారక స్థితిలోనే ఉంటూ శుక్రవారం రాత్రి పరమపదించారు. మహమ్మద్ ఫజల్ రహ్మాన్ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందినవారు. ఆత్మీయుడు ఫజుల్ రహమాన్ మృతి పట్ల ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక సంపాదకులు సయ్యద్ కరీం తీవ్ర విచారం వ్యక్తం చేసి సంతాపం ప్రకటించారు.



# పుర పీఠాలపై.. నజర్!

■ నిర్మల్, బైంసా, ఖానాపూర్‌లో మొదలైన పుర రాజకీయం ■ వార్డుల్లో అభ్యర్థుల 'స్టంట్లు'.. ■ ఇంటింటికీ తిరుగుతున్న ఆశావహులు

■ పంచాయతీ జోష్‌లో బీజేపీ, అధికార బలంతో కాంగ్రెస్ వ్యూహాలు ■ సత్తా చాటేందుకు బీఆర్ఎస్.. ■ పట్టు కోసం ఎంఐఎం ఆరాటం

**ఫిబ్రవరిలో మున్సిపల్ పోరు ఉంటుందన్న నేపథ్యంలో, బల్దియా ఎన్నికల పోటీలకు ప్రధాన పార్టీలు సన్నదమవుతున్నాయి. ఇప్పటికే స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్లెలో పంచాయతీ ఎన్నికలు ముగియగా.. ఇక పట్టణలలో మున్సిపల్ ఎన్నికల రాజకీయ రాజీ రాజుకుంది. ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితా రావడంతో పట్టణంలో రాజకీయాల హంగామా మొదలైంది.** అయితే నిర్మల్ జిల్లాలో నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపల్ పోల్ లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు అయినటువంటి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించుకుంటు న్నాయి. మరోపక్క కొందరు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే అభ్యర్థులు, పక్క రాష్ట్రమైనటువంటి మహారాష్ట్రలో ఫామ్‌లో ఉన్నటువంటి శిండే శివసేన పార్టీ బి ఫామ్‌లు తీసుకొచ్చే యోచనలో ఉన్నారు. గత నెలలో పూర్తయిన పంచాయతీ ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలు మున్సిపల్ పోరుకు సన్నదమవుతున్నాయి. జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా సర్పంచ్ స్థానాలు గెలిపించుకోగా బీ.ఆర్.ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం లోనే కొంత మేరకు ప్రభావం చూపగలిగింది. ఈ ఫలితాల ఆధారంగా ఆయా పార్టీలు మున్సిపాలిటీల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న లెక్కలు వేసుకుంటున్నాయి.

8లో



3

# రేవంత్‌వి పిట్టలదొర మాటలు

■ కాంగ్రెస్ సర్కార్‌ను ప్రజలు తిరస్కరించే రోజు దగ్గరలోనే ఉంది..

■ రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే ■ ఎంపీ ఈటెల రాజేందర్, మహేశ్వర్ రెడ్డి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ పిట్టల దొరల వ్యవహారిస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు.** శుక్రవారం బైంసాలోని ఎస్ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీలో బిజెపి సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా గారడీ మాటలతో కాలం వెల్లడిస్తుందన్నారు. పెన్షన్ పెంపు, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు.

## ఆసిఫాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ఎండ్లబండిని బైక్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

ఒకరి తీవ్ర గాయాలు

ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లాలోని బాబాపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఎడ్లబండిని బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.



# రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం




2

■ విద్యార్థినులకు రక్షణగా పోలీసు అక్క..

■ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు

■ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి

■ పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష

■ సిబ్బంది అంకిత భావంతో పని చేయాలి

■ ఆదిలాబాద్‌జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలను 20 శాతం వరకు తగ్గించడమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.** రానున్న సంక్రాంతి నేపథ్యంలో చైనా మాంజాను కట్టడి చేయడంతో పాటు.. లక్కీడ్రాలు, కాటలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మంది రంలో ఏర్పాటు చేసిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని సూచనలు చేశారు.



# రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యం

- విద్యార్థినులకు రక్షణగా పోలీసు అక్క..
- రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి
- పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష
- ఆదిలాబాద్‌జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలను 20 శాతం వరకు తగ్గించడమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. రానున్న సంక్రాంతి నేపథ్యంలో చైనా మాంజాను కట్టడి చేయడంతో పాటు..లక్కీ డ్రాలు,పేకాటలు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని సూచనలు చేశారు. రోడ్డు భద్రత మాసోత్సవ సందర్భంగా మైనర్ డ్రైవింగ్ జరగకుండా, లైసెన్స్ మేళా నిర్వహిస్తూ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు, బైక్ ర్యాలీ, విద్యార్థులతో నడక ర్యాలీ వంటివి నిర్వహించాలని సూచించారు. అదే విధంగా రానున్న సంక్రాంతి సందర్భంగా చైనా మాంజా జిల్లా వ్యాప్తంగా లేకుండా మరియు సంక్రాంతి సందర్భంగా లక్కీ డ్రాలు, పేకాటలు, ఆసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నెలవారి నీరసమీక్ష సమావేశంలో రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నూతన సంవత్సరం నూతన ఆలోచనలతో ప్రజలకు మరింత చేరువై పటిష్టమైన పోలీసు విధులను నిర్వర్తిస్తూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిని ఉక్కు పాదంతో అణచివేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు చట్టాలపై, నేరాలపై, సైబర్ క్రైమ్ పై మహిళల పట్ల జరుగు అఘాయిత్యాలపై, బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలన్నారు. ఎలాంటి సందర్భంలోనైనా డయల్ 100 కి సమాచారం అందించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై రోడ్డు భద్రతా నియమాలు ట్రాఫిక్ నియమాలు పాటించేలా, గ్రామ గ్రామాల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా నూతన సర్పంచులను ప్రోత్సహించాలన్నారు. పోలీసు యూనిఫామ్ ద్వారా పరువు, ప్రతిష్ట, కీర్తి లభిస్తాయని దానని సక్రమంగా ధరించాలని తెలిపారు. దాబా యజమానులచే సమావేశాలు ఏర్పాటు చేసి రోడ్డుపై పార్కింగ్ జరగకుండా దాబాలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షంచాలన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా గాంజాయి మాదకద్రవ్యాలు పై అవగాహన కల్పించాలన్నారు. రాత్రి సమయాలలో ప్రత్యేకంగా బీట్ నిర్వహిస్తూ దొంగతనాలను నేరాలను అరికట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వీడీసీలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా చూడాలన్నారు. లాడ్జిలలో హెూటలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. గత నెల రోజులలో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50 మంది పోలీస్ అధికారులకు సిబ్బందికి ప్రత్యేకంగా ప్రశంసా పత్రాలను అందజేసి ప్రోత్సహించారు. దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలను పాటించాలని నేరస్తులకు శిక్షలు పడే విధంగా పరిశోధన కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల రికార్డులను పరిశీలించి కేసులవారిగా పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కాజల్ సింగ్ ఐపీఎస్, బి సురేందర్ రావు, ఏఎస్పీ అడ్మిన్ పి మౌనిక ఐపీఎస్, శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డిసిఆర్బి, ఎన్ఐబి, సైబర్ క్రైమ్, ఐటి కోర్, ఫింగర్ ప్రింట్ రిజర్వేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# క్షయ వ్యాధిపై సమాజంలో విస్తృత అవగాహన అవసరం



**నిర్మల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
సమాజంలో టీబీ వ్యాధి నివారణ కోసం ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం అని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం ప్రత్యూష అన్నారు. శుక్రవారం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చించోలి బి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ క్యాంపెయిన్ లో భాగంగా క్షయ వ్యాధి ఉచిత నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మందికి ఉచితంగా డిజిటల్ ఎక్స్ రే పరీక్షలు చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు టీ బీ పట్ల జాగ్రత్త పడాలన్నారు. ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, రాత్రిపూట చమటలు పట్టడం, దగ్గినప్పుడు రక్తం పడటం, అలసట నీరసం, గతంలో అనారోగ్య సమస్యలతో బాధపడేవారు, ఛాతిలో నొప్పి, శరీరంలో ఏ భాగంలోనైనా వాపు లాంటి లక్షణాలు ఉన్నట్లయితే గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అలాగే తెమడ పరీక్ష, ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయన్న, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్ గౌడ్, సిబ్బంది రవి కిరణ్, పవన్, నుస్రత్, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాలువలో దూసుకెళ్లిన బైక్

**వాంకిడి, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
వాంకిడి మండలంలోని లింబరావు గూడ గ్రామశివారులో గురువారం రాత్రి ఓ బైక్ అదుపుతప్పి కాలువలో దూసుకెళ్లింది. వివరాల్లోకెళితే సోనాపూర్ చిచ్పల్లి గ్రామానికి చెందిన నాయుడు శుభం కోపగూడ గ్రామానికి వెళ్ళి.. రాత్రి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలోనే బైక్ అదుపుతప్పి సమీపంలోని కొమురం భీం ప్రధాన కాలువలో దూసుకెళ్లింది. అటుగా వెళ్తున్న స్థానికులు కొందరు గమనించి.. అతికష్టం మీద అతనిని కాలువ నుండి బయటకు తీశారు. దీంతో ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. 108 అంబులెన్స్ కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో బైక్ నడపడం వల్లే బైక్ కాలువలో దూసుకెళ్లిందని స్థానికులు చెబుతున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



**కుభీర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
కరెంట్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన విషాదకర సంఘటన శుక్రవారం తెల్లవారుజామున నిర్మల్ జిల్లాలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల్లోకెళితే కుబీర్ మండలంలోని సిరిపెల్లి గ్రామంలో సంబెట్ వార్ గంగాకిషన్ నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా గంగాకిషన్ ఇంటిలో షాక్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి ఇల్లు పూర్తిగా దగ్ధమైందన్నారు. ఇటీవల పత్తి పంట అమ్మి తీసుకువచ్చిన డబ్బులను బీరువాలో పెట్టగా కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్టడీ సర్టిఫికెట్స్ భూములు, ఇళ్లకు సంబంధించిన డాక్యుమెంట్స్ కూడా కాలిపోయాయని తెలిపారు. ఇంట్లోని నిత్యావసర సరకులు, విలువైన వస్తువులు పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట అమ్మగా వచ్చిన రెండు లక్షల రూపాయలు, ఇంట్లోని నాలుగు లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఫైర్ ఇంజన్ మంటలను ఆర్పి వేసినా జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది.

## సంక్రాంతి వేళ చైనా మాంజా వాడితే కఠిన చర్యలు

**మందమర్రి, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
సంక్రాంతి పండుగ వేళ గాలిపటాలు ఎగురవేసే ఉత్సాహంలో ప్రజలు, ముఖ్యంగా యువత తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని మందమర్రి ఎస్.ఐ. రాజశేఖర్ సూచించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిషేధిత చైనా మాంజా (నైలాన్/సింథటిక్ దారం) వాడకంపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. చైనా మాంజా గొంతుకు తగిలితే కోసుకుపోయే ప్రమాదం ఉందని, గతంలో ఇలాంటి ఎన్నో విషాద ఘటనలు జరిగాయని ఆయన గుర్తుచేశారు. పర్యావరణానికి మేలు చేసే పక్షులు ఈ దారానికి చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు.





## ఎంజీఎన్ఆర్ ఈజీఎస్‌లో గాంధీ పేరు తొలగింపుపై నిరసన

**ఉట్నూర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ శుక్రవారం జైనూర్ మండలం కర్ణంగూడ కాంగ్రెస్ పార్టీ ఎదుట కాంగ్రెస్ నాయకుడు గేడం శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఉపాధి హామీ కూలీలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీధర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడం బీజేపీ ప్రభుత్వానికి గాంధీ సిద్ధాంతాలపై ఉన్న ద్వేషాన్ని స్పష్టం చేస్తోందన్నారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఈ పథకానికి గాంధీ పేరు ఒక స్ఫూర్తిని, ఆ పేరును తొలగించడం కోట్లాది కూలీల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాసంక్షమ పథకాలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని, ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం ద్వారా గ్రామీణ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. గాంధీ పేరు తిరిగి పథకంలో చేర్చే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## కైరిగూడ అటవీ ప్రాంతంలో పులి సంచారం

**ఆసిఫాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీ మండలంలోని కైరిగూడ అటవీ ప్రాంతంలో పులి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనకు గురి చేస్తోంది. గురువారం అర్ధరాత్రి కైరిగూడ ఓసీ గోలేటి మధ్య అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా ఓ లారీ డ్రైవర్ తీసిన మీడియా ప్రస్తుతం సోషల్ మీడియా వైరల్ మారింది. దీంతో అక్కడి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.



# సీఎం రేవంత్ రెడ్డివి పిట్టలదొర మాటలు

■ రాష్ట్రంలో రానున్నది బిజెపి ప్రభుత్వమే
■ సర్పంచ్‌ల సన్మాన సభలో ఈటెల రాజేందర్, ఏలేటి





**ముథోల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూటకో మాట మాట్లాడుతూ పిట్టల దొరల వ్యవహారిస్తున్నారని మల్కాజిగిరి ఎం. పి. మాజీ మంత్రి బిజెపి నేత ఈటెల రాజేందర్, బిజె ఎల్పి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం భైంసా లోని ఎస్ ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీ లో బిజెపి సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులు గా హాజరై మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా గారడీ మాటలతో కాలం వెల్లడిస్తుందన్నారు. పెన్షన్ పెంపు, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు కెసిఆర్ ను బొంద పెట్టిన విధంగా, కాంగ్రెస్ సర్కార్ కు గుణ పాఠం చెబుతారని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో బిజెపి ఒక్క సారి అధికారం లోకి వస్తే 25 సంవత్సరాల పాటు పాలిస్తున్న రాష్ట్రాలు ఉన్నాయన్నారు. ముథోల్ విజయం స్ఫూర్తి తో రానున్న అన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. మైనారిటీ ఓట్లను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఎన్నకలకు వెళ్తుందే తప్ప చేసింది ఏమి లేదన్నారు. అభివృద్ధి పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మౌనం, సహనం, ఓపిక ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తత్త్వమని అందుకే ముథోల్ నియోజకవర్గం లో 103 స్థానాలు గెలిచారంటే అది ఏక పక్ష తీర్పే నన్నారు. 15 ఫైనాన్స్ నిధుల కోసమే రేవంత్ రెడ్డి ఇష్టం లేకున్నా సర్పంచ్ ఎన్నికలకు వెళ్లారన్నారు. 20 రోజులు గడుస్తున్న సర్పంచ్ లకు చెక్ పవర్ ఎందుకు ఇవ్వడం లేదన్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులన్నీ కేంద్రానివని,గ్రామాల అభివృద్ధి వాటి వల్లే జరుగుతుందన్నారు. సొమ్ము కేంద్రానిది సోకు రాష్ట్రనిధి అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్టానికి ముఖ్యమంత్రి అని బిజెపి సర్పంచ్ ల పట్ల వివక్ష చూపితే కర్రు కాల్చి వాత పెడతామని హెచ్చరించారు. బీజేఎల్పి ఉప నేత పాయల శంకర్, ఎంపి నగేష్, ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

**సర్పంచ్‌లకు సన్మానం...**
కార్యక్రమంలో ముథోల్ నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లను, ఉప సర్పంచ్‌లను వార్డ్ మెంబెర్‌లను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ శాలువాతో సత్కరించి మెమంటోలు ప్రధానము చేశారు. కార్యక్రమం ప్రారంభం కంటే ముందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమానికి పెద్ద మొత్తంలో జనం రావడంతో సభ సక్సెస్ అయింది. వేలాది మందితో ఎస్-ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ నిండి పోయింది. కార్యక్రమం లో సీనియర్ నాయకులు, నాయకులు, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





## యువకులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

**ముథోల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
యువకులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సిఐ రవీందర్ నాయక్, సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్ పేర్కొన్నారు. ముథోల్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రింట్- అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ను సర్పంచ్ షబానా ఎజాజ్ ఉద్దీన్ టాస్ ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు... క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గెలుపోటములు సహజమని, గెలిచిన వారు ఓడిన వాళ్ల పోరాట పటిమను మెచ్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో ఆటలు ఆడితే నైపుణ్య సామర్థ్యం పెరుగుతోందన్నారు. ఆటలు ఆడేటప్పుడు చైతన్యం, ఉత్తేజం ఉంటుందని అన్నారు. ప్రారంభ మ్యాచ్ లోరబింద్ర స్కూల్ (ముథోల్) ఎఫ్‌టి (భైంసా) జట్లు పోటీపడగా భైంసా జట్టు బోణి కొట్టింది. రెండవ మ్యాచ్ లో -సర్కిల్ స్ట్రైకర్స్ ముథోల్ టీమ్ వర్సెస్ బట్టి గల్లీ ముథోల్ జట్టు పోటీపడగా బట్టి గల్లీ ముథోల్ జట్టు విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అష్ట సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, ఎస్ ఐ పెర్సిస్, ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయినాథ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్ నాథ్, మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్,వార్డ్ సభ్యులు విశ్వంబర్, ముజీబ్,సాయినాథ్, విష్ణు, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, మాక్దూమ్, దేవోజీ భూమేష్, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న పాల్గొన్నారు.



# శ్రీ అక్షరలో ముందస్తు సంక్రాంతి వేడుకలు



**ముథోల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని శ్రీ అక్షర పాఠశాలలో యాజమాన్యం పిల్లలకు సంక్రాంతి పండగ విశిష్టతను తెలియజేసేందుకు శుక్రవారం విద్యార్థి విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించింది. హరిదాసుల కథలు, పురాతన కాలంలో మాదిరి పిడకల పొయ్యిపై పరమాన్నం వండడం పూరి గుడిసెల ప్రజల అలంకరణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు పూరి గుడిసెలను నిర్మించి పల్లెటూరి వాతావరణంలో పాఠశాలలో ఏర్పరిచారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు సంక్రాంతి విశిష్టతను తెలియజేసి ముగ్గుల పోటీలను, గాలిపటాల, నృత్యాలను, పాటల పోటీలను నిర్వహించడంతో పాఠశాల ఆవరణ పండగ వాతావరణాన్ని తలపించింది. ముఖ్యంగా పల్లెటూరి బావి, పూరి గుడిసె, బండేడ్ల జోడి, కోడి పందెం లను విద్యార్థులు అట్టముక్కలతో తయారు చేయడంతో అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ సుభాష్ మాట్లాడుతూ ప్రతి పండగ యొక్క విశిష్టతను తెలుసుకోవడం తప్పనిసరి అందుకే పాఠశాల ఆవరణలో విద్యార్థులకు పండగ విశిష్టతను తెలియజేసి వారిని ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసి విద్యార్థులను ఉత్సాహ పరిచినట్లు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సాయికుమార్, అకాడమిక్ ఇంచార్జ్ మధుసిందే, ఉపాధ్యాయులు మహేందర్, సంతోష్, మహేందర్, విద్యార్థులు తదితరులున్నారు.



# విద్యార్థుల ఆరోగ్యంతో టీచర్ల చెలగాటం





**ఆసిఫాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని పెట్టాలని ఓ పక్కా ప్రభుత్వం ఆదేశిస్తుంటే..! ఉపాధ్యాయులు ధనార్జనే ధ్యేయంగా నాణ్యత లేని సరుకులతో భోజనం పెడుతూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గత కొద్ది రోజులుగా పాఠశాల సిబ్బంది హెడ్ మాస్టర్ మధ్యాహ్న భోజనంలో పురుగులు పడ్డ భోజనం పెట్టడంతో విద్యార్థులు ఇంటి నుండే భోజనం తీసుకెళ్తుండగా గమనించిన తల్లిదండ్రులు ఎందుకు ఇంటి వద్ద నుంచి భోజనం తీసుకెళ్తున్నారని విద్యార్థులను అడగగా పురుగులు పడ్డ భోజనం వండి పెడుతున్నారని చెప్పారు. దీంతో శుక్రవారం గ్రామ పెద్దలు. యువకులు పాఠశాలకు వెళ్లి స్టోర్ రూమ్ చూడగా చెల్లాచెదురుగా పడి ఉన్న బియ్యం బస్తాలను విప్పి చూడగా అందులో పూర్తిగా కుళ్ళిపోయిన. పురుగులు పడి ఉన్న బియ్యాన్ని గుర్తించి పాఠశాల సిబ్బంది పనితీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ ఎం ప్రశ్నించగా ఇంకొకసారి ఇలాంటి తప్పు జరగకుండా చూసుకుంటానని దాటవేసే సమాధానం చెప్పారు. హెచ్‌ఎం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## ఘనంగా ప్రపంచ హిందీ దివస్

**ఉట్నూర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా, సాయి ప్రసాద్ మాట్లాడుతూ హింది భాష విశిష్ఠతపై వివరించారు. జాతీయ భాష హిందినని గుర్తు చేశారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు హింది భాషను నేర్చుకోవాలన్నరు. హిందీ భాషపై పట్టు సాధించాలనీ సూచించారు. కార్యక్రమంలో కాంచన, స్వామి, నర్సింగ్ రావు చంద్రశేఖర్, రాజశేఖర్, రాహుల్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.






### బాలికల పాఠశాలలో
## ముందస్తు సంక్రాంతి సంబరాలు

**నిర్మల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సోమవార్ పేట్ లో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లి పోటీలను జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించారు. విద్యార్థినీలు పాఠశాల మైదానాన్ని రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థినిలు, ఉపాధ్యాయులు గాలిపటాలను ఎగురవేశారు. హరిదాసు వేషధారణ చేసిన అమ్మాయి హరికథను ఆలపించారు. చెరుకు గడలు మధ్య నవధాన్యాలు కుండలను ఉంచి పూజించారు. అనంతరం రంగవల్లి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూడారపు పరమేశ్వర్ ఉపాధ్యాయులు లక్ష్మణ్, గణేష్, ప్రేమల ,శకుంతల, సుజాత, వర్షా, నివేదితతో పాటు ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు

### విజయ జిన్నింగ్‌లో సిసిఐను
## మోసగించిన నిందితుల అరెస్ట్

**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

శుక్రవారం విజయ జిన్నింగ్‌లో పనిచేస్తున్న 7 మంది వ్యక్తులు ఎలాగైనా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని పథకం ప్రకారం సీసీఐని మోసగించాలని ఉద్దేశంతో ఒక లోడు గల ట్రాక్టర్ ని రెండుసార్లు తూకం చేసి ఒక రైతు సహాయంతో అతని అకౌంట్లోకి డబ్బులు కొట్టించుకుని ప్రభుత్వ సంస్థ అయినటువంటి సిసిఐని మోగించారు. మూలే మారుతి, చెర్ల అరుణ్ కుమా ర్, ఐద శివరాజ్, గోతి సునీల్, నవీన్ నీలేష్ మరియు వారికి సహకరించిన గోకుల నారాయణ వీరందరూ పథకం ప్రకారం 15 ,16 డిసెంబర్ తేదీలలో తూకం వేసిన లోడ్ ట్రాక్టర్ ను మళ్లీ తూకం వేసి దాదాపు 82 .6 క్వింటాళ్ల పత్తిని మోసగించి సీసీఐకి అమ్మినట్లు తప్పుడు అమ్మకం జరిపి 6,61,626/- రూపాయలను వారు ఆర్జించి స్వార్థానికి వాడుకున్నారు. ఇట్టి వ్యక్తులలో నలుగురు నిందితులు మూలే మారుతి, చెర్ల అరుణ్ కుమార్ ,ఐద శివరాజ్, రాథోడ్ నవీన్‌లనురిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సిఐ రాజు తెలిపారు.

## గజిల్లాలో 20 మంది కారుణ్య నియామకాలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో 20 మంది యువతను కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగాలలో నియమించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్‌తో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలలో విధులు నిర్వహిస్తూ ఆకస్మాత్తుగా మరణించిన వారి కుటుంబ పోషణ నిమిత్తం ఆయా కుటుంబ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని, ఈ క్రమంలో 20 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవు

### ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి



**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

నిబంధనలు ఉల్లంఘించి వాహన నంబర్లు మారుస్తూ, నంబర్ ప్లేట్లు టాంపరింగ్ చేస్తూ, నకిలీ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసి వాహనాల నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో ఏడు కేసులు నమోదు అయినట్లు అందులో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. శుక్రవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఒక వాహనానికి రిజిస్ట్రేషన్ లేకుండా ఫేక్ నెంబర్ ప్లేట్ తో తిరుగుతూ ఉన్నటువంటి యజమానిని దానిని అమ్మిన వారిని నలుగురిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేసి కోర్టులో డిపాజి చేయబడతాయని తెలిపారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

**పెంచికల్‌పేట్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**



కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజకమలాకర రెడ్డి డిమాండ్ చేశారు.ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ పిలుపు మేరకు శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలం చేడ్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జనవరి 10న ప్రధాని, రాష్ట్రపతులకు మెమోరండంలు పంపాలని, ఫిబ్రవరి 5న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్‌చందర్, సంతోష్‌కుమార్, శ్రీనివాస్, శిల్ప, ద్రుపదబాయి, శ్రీకాంత్, వెంకటేష్, శ్రీధర్, సునీత, అశ్విని పాల్గొన్నారు.



### అభివృద్ధి పనులను వేగవంతం చేసి
## త్వరగా పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి కొనసాగుతున్న వంటశాల, ఇతర మరమ్మత్తు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు, ప్రతి నివాసానికి నిరంతరం త్రాగునీటిని అందించేందుకు పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణం, ఇతర పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తో కలిసి పరిశీలించారు. అనంతరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.












## ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ

- విద్యార్థులు సీఎం కప్ పోటీలలో పాల్గొనాలి
- ఉత్సాహంగా కదిలిన యువత, విద్యార్థులు
- క్రీడలు శారీరక, మానసిక అభివృద్ధికి దోహదం
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్

**మంచిర్యాల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా అన్ని రంగాలలో ఆత్మస్థైర్యంతో రాణించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సిఎం కప్ క్రీడలు 2025లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఐ. బి. చౌరస్తాలో డి.సి.పి. ఎ. భాస్కర్, ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా యువజన క్రీడా సేవల శాఖ అధికారి హనుమంత రెడ్డి, ఇతర అధికారులు, క్రీడాకారులతో కలిసి టార్చ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ క్రీడల సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన సి ఎం కప్ 2025 2వ ఎడిషన్ క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, చేసే ప్రతి పనిలో ఏకాగ్రత పెరుగుతుందని, అన్ని రంగాలలో రాణించవచ్చని తెలిపారు. రాష్ట్రంలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి విద్యా సంస్థలు కొంత సమయం ఆటలు, క్రీడలకు కేటాయించాలని తెలిపారు. సి ఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి క్రీడా పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో టాప్‌లో నిలవాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**







**బేల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

పదవ తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో టాప్ లో నిలవాలనీ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దాతల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభి పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు వేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో మొదట 130 పాఠశాలల్లో ప్రారంభించిన 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం, ప్రస్తుతం 250 పాఠశాలల్లో విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని, తద్వారా విద్యార్థుల అనారోగ్య సమస్యలు తగ్గి, పాఠశాల హాజరు శాతం గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడా రంగంలోనూ రాణించాలని, క్రీడా రంగంలో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటలో ఉద్యగాలు సాధించవచ్చన్నారు. సిఎం కప్ క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆయన ఆకాంక్షంచారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో బేల ఉన్నత పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, జిల్లాలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పిలునిచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు సుమారు 3 లక్షల రూపాయలు అందించారని, ఆ నిధులతో విద్యార్థుల కోసం స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందందనీయమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ దాతలను శాలువాలతో సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు పాఠశాలలో కిచెన్ షెడ్, ఆరోగ్య పాఠశాల కార్యక్రమాలపై గోడలపై పెయింటింగ్‌లను కలెక్టర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, దాతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**



**ఆసిఫాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్, ఇంచార్జ్ జిల్లా విద్యాధికారి దీపక్ తివారితో కలిసి సందర్శించి వంటశాల, వంట సామాగ్రి నిల్వ గది, మెనూ పట్టిక, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షమ వసతి గృహాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పౌష్టిక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలని తెలిపారు. వంటశాల, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వార్షిక పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక రూపొందించాలని, సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. చలి తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఉదయం వేడి నీరు అందించాలని, ఆహారం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకరమ్మ పాల్గొన్నారు.



## సీనియర్ పాత్రికేయుడు
# రెహమాన్ ఇకలేరు

**హైదరాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

సీనియర్ పాత్రికేయుడు, రచయిత, ఉపాధ్యాయుడు, 'ప్రతిపక్షం' దినపత్రిక సంపాదకుడు మహమ్మద్ ఫజుల్ రెహమాన్(66) ఇకలేరు. గత ఆరు రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో అపస్మారక స్థితిలోనే ఉంటూ శుక్రవారం రాత్రి పరమపదించారు. మహమ్మద్ ఫజల్ రహ్మాన్ ప్రస్తుతం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కు చెందినవారు. 1960లో ఆయన అంతకపేటలో జన్మించారు. 1980 ప్రాంతంలో ఆంధ్రప్రభ కు హుస్నాబాద్ విలేకరిగా జర్నలిస్టు జీవితం ప్రారంభించారు. అందులో చాలా సంవత్సరాలు పనిచేసిన ఆయన తర్వాత హైదరాబాద్‌లో ఆంధ్రజ్యోతిలో పనిచేశారు. తర్వాత 'దిశ' పత్రికలో ఆవిర్భావం నుంచి పనిచేశారు. అటు తర్వాత 'ముద్ర' పత్రికలో కొంతకాలం పనిచేసి రెండు సంవత్సరాల క్రితం తను సొంతంగా 'ప్రతిపక్షం' దినపత్రిక ప్రారంభించి సంపాదకులుగా పనిచేస్తున్నారు. 1990 ప్రాంతంలో హుస్నాబాద్ పబ్లిక్ స్కూల్ పాఠశాల ప్రారంభించి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. హుస్నాబాద్‌లో ప్రెస్ క్లబ్ ఆవిర్భావంలో, జర్నలిస్టు సంఘం నిర్మాణంలో, హుస్నాబాద్ యూత్ అసోసియేషన్ నిర్మాణంలో, స్ఫూర్తి అసోసియేషన్‌లో ఆయనకు అనుబంధం ఉంది. ఫజల్ రెహమాన్‌కు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు.

## జర్నలిస్టును బెదిరించిన ఎమ్మెల్యే
# అనుచరుడిపై కేసు నమోదు

**బెల్లంపల్లి, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అనుచరుడు కానుకూరు రామచందర్, ఎన్‌టీవీ రిపోర్టర్ రమేష్‌ను ఫోన్‌లో పరుష పదాలతో దుషించి, కబ్జాలపై వార్తలు రాస్తే చంపేస్తానని బెదిరించినట్లు సమాచారం. కుటుంబ సభ్యులను ప్రస్తావించి హెచ్చరించినట్లు తెలిసింది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన జర్నలిస్టులు బెల్లంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. జర్నలిస్టు సంఘాలు ఈ చర్యను ఖండించి, నిరసన వ్యక్తం చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ పై వన్ టౌన్ ఎస్ హెచ్ ఓ శ్రీనివాసరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఓ టీవీ ఛానల్ రిపోర్టర్ అందుగుల రమేష్ ను మొబైల్ ఫోన్లో అసభ్యకరంగా చమదూషించినట్లు ఫిర్యాదు అందింది. రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్హెచ్ఓ వెల్లడించారు.



# హైమన్ డార్ఫ్-బెట్టి ఎలిజబెత్ స్మారక క్రీడలు ప్రారంభం



**జైనూర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

హైమన్ డార్ఫ్--బెట్టి ఎలిజబెత్ స్మారక క్రీడా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను స్థానిక సర్పంచ్ కనక ప్రతిభతో కలిసి జైనూర్ సీఐ రమేష్, ఎస్సై రవీందర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, క్రీడలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహిస్తూ గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని క్రీడాకారులు ప్రదర్శించాలని సూచించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు.

# శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఈ-వేస్టేజ్‌పై అవగాహన

**ఆసిఫాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

హరిత హెక్టన్ ఈకో, ఈ-వేస్టేజ్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో ఈ-వేస్టేజ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫణికుమార్ (ఐఈఎస్ కన్సల్టెంట్ ట్రెయినీ, డీఆర్‌డీఓ), అరుణ, అర్చన (టీవీడబ్ల్యూడీఆర్‌డీసీ కళాశాల లెక్చరర్లు) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు పీపీటీ ప్రజెంటేషన్ల ద్వారా ఈ-వేస్టేజ్ లాభనష్టాలు, తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. పోటీల్లో విజేతలుగా కుమారి సౌమ్య (రూ.5,000), ఏటంకర్ వెంకటేష్ (రూ.3,000), కుమారి ఆదిభ తహరిన్ (రూ.1,000) ఎంపికై బహుమతులు అందుకున్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.





## గురుకులంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**కాసిపేట, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ సాంఘిక సంక్షమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి వేడుకల్ని పురస్కరించుకుని విద్యార్థులు ముందస్తుగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా 5వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు హరినాధుని వేషధారణతో హరిదాసు కీర్తనలు చేశారు. భోగి మంటలు వేశారు, పూర్ణకుంభంలోపాలు పొంగించారు. గాలిపటాలు ఎగరవేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు సంక్రాంతి ఒక ముఖ్యమైన పంటల పండుగన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలు విద్యార్థులకు తెలిసేలా ప్రతీ సంవత్సరం పండుగను వైభవంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతి పండుగ ప్రకృతి కృతజ్ఞతకు కొత్తదనానికి స్వాగతం పలికే పండుగ అన్నారు.

## చైనా మాంజా వాడితే కేసులు



**లక్షెట్టిపేట, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
చైనా మాంజా వాడితే కేసులు తప్పవు అని ఎస్ఐ సురేష్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాలను ఎస్సై, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా చైనామంజా వాడిన చైనామంజాను ఎవరైనా విక్రయాలు జరిపిన కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని దుకాణదారులను హెచ్చరించారు. చైనా మంజ వాడకంతో ఇప్పటికీ పలు ప్రాంతాల్లో చాలా ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోయారని ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారికి చైనా మాంజా తగిలి ఈ ప్రమాదాలు జరిగాయన్నారు. చైనా మాంజాతో గాలిలో ఎగిరే పక్షలు కూడా ప్రాణాలు కోల్పోయాయని వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చైనా మాంజాను నిషేధించడం జరిగిందన్నారు. ఎవరు కూడా చైనా మాంజా తో గాలిపటాలు ఎగరేసిన చైనా మాంజాను ఎవరైనా అమ్మినట్లు తెలిసిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని దుకాణదారులకు అవగాహన కల్పించారు.

## పట్టణంలో చోరీల కలకలం

**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలో గురువారం రాత్రి దుండగులు నాలుగు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. తాటిగూడలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు.. 30 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా తాంసి బస్టాండ్ ప్రాంతంలోని మూడు మాంసం దుకాణాల్లోనూ చోరీలకు పాల్పడ్డారు. షాపుల్లో మాంసం కట్చేసే కత్తులు తదితర వస్తువులను అపహరించారు. అదేవిధంగా రైల్వే స్టేషన్ వద్ద ఒక వ్యక్తి వద్ద ఉన్న చరవాణి, రూ.1,500 నగదును ఇద్దరు దుండగులు బలవంతంగా దోచుకున్నారు. ఈ ఘటనపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**మంచిర్యాల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
మహిళా చట్టాలపై అందరికి అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ నరేష్ కుమార్ అన్నారు. శుక్ర వారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని మార్టిన్ గ్రామర్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణ, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, ట్రాఫిక్ నియమాలు, యాప్, షీ టీమ్ సేవల గురించి విద్యార్థులకు వివరించారు. పోక్సో చట్టం ద్వారా 18 సంవత్సరాల లోపు పిల్లలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించబడుతుందని, పిల్లలపై నేరాలకు పాల్పడిన వారికి కఠినమైన శిక్షలు ఉంటాయని సీఐ తెలిపారు. ఈవ్ టీజింగ్‌కు గురైనప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు సంబంధించి హెల్ప్‌లైన్ (1930)కు ఫిర్యాదు చేయాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి గుడ్ టచ్-బ్యాడ్ టచ్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, అపరిచితుల అనుచిత ప్రవర్తనను వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. మహిళల భద్రత కోసం ౧-ఘుటవ యాప్ వినియోగంపై వివరించారు. షీ టీమ్ సేవల కోసం డయల్ 100తో పాటు రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నంబర్ 8712659385లను గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సభిహా సుల్తానా, షీ టీమ్ సిబ్బంది, మహిళా కానిస్టేబుల్ శ్రీలత, కానిస్టేబుల్ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలి



**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హై స్కూల్‌లో జాతీయ రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాజేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి అంశాలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు బాధ్యతాయుతంగా రోడ్డు ప్రయాణం చేయాలని, తమ తల్లిదండ్రులు కూడా రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడడంలో సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ అంశం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. అలాగే రోడ్డు భద్రతా అంశాలపై నిర్వహించిన ఎలోక్యూషన్, రంగోలి, స్కిట్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి విద్యార్థులు, రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఓ శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యుడు రాజేశ్వర్, ఎంఈఓ సోమయ్య, ఎఎంవిఐ హరింద్రకుమార్, ఎఎంవిఐ నిహారిక, సెక్టోరియల్ ఆఫీసర్ తిరుపతి, డాక్టర్ దీపిక, సిస్టర్ గ్రేస్, ప్రిన్సిపల్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు నైపుణ్యం అవసరం

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
విద్యతో పాటు నైపుణ్యం కలిసినప్పుడే యువత జీవితంలో స్థిరత్వం, గౌరవం లభిస్తాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలో షిర్డీ సాయి సేవా సంస్థ, రామనంద తీర్త గ్రామీణ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు సరిపోవని, వాటితో పాటు ప్రయోజనకరమైన నైపుణ్యాలు ఎంతో అవసరమని చెప్పారు. యువత భవిష్యత్తు అభివృద్ధికి నైపుణ్య శిక్షణలు కీలకమని, ఇవి వారి కలలకు వేదికగా నిలుస్తాయని అన్నారు. ఈ ప్రాంత యువత ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేలా శిక్షణలు అందించడం అభినందనీయమని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధిని పొందడంతో పాటు కుటుంబాలకు బలమైన ఆధారంగా నిలవాలని ఆయన ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో స్వామి రామనంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ కిషోర్



రెడ్డి, గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్ గంగారెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు దెబ్బడి అశోక్, గంగాధర్, రాజేష్, సారిక, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎఫ్పీఓ సభ్యత్వ నమోదు

**బెల్లంపల్లి, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలో ఎఫ్పీఓ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మంచిర్యాల జిల్లా సహకార అధికారి ఎం. సత్యనారాయణ ఆదేశాల మేరకు, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి పీఏసీఎస్ ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యత్వ నమోదు శుక్రవారం ప్రారంభించారు. రైతులకు లక్ష్యలు, ఉద్దేశాలు ఈ పథకం ద్వారా లభించే ప్రయోజనాలు వివరించారు. సమూహ మార్కెటింగ్, మెరుగైన ధరల లభ్యత, వ్యవసాయ ఇన్‌పుట్ల సౌకర్యం, రుణాలు, శిక్షణ రైతుల ఆర్థిక అభివృద్ధి గురించి విపులంగా చెప్పారు. కన్నాల గ్రామానికి చెందిన బమండ్లపల్లి స్వామి రూ. 2,000 సభ్యత్వ ఫీజు చెల్లించి ఎఫ్పీఓ సభ్యత్వం పొందారు. ఏరియా ఆఫీసర్, జి.సందీప్ కుమార్, అడాప్షన్ ఆఫీసర్ బి. సురేందర్, చంద్రవెల్లి పీఏసీఎస్ కార్యదర్శి సంస్థ సిబ్బంది సహాయకులు రైతులకు అవగాహన కల్పించి, సభ్యత్వం తీసుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి రైతుల నుంచి మంచి స్పందన లభించగా, రాబోయే రోజుల్లో మరింత ఎక్కువ మంది రైతులు ఎఫ్పీఓ సభ్యత్వం పొందేందుకు ఆసక్తి చూపాలని కోరారు.

## క్రికెట్ టోర్నీ ప్రారంభం

**మంచిర్యాల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ లోని 30వ డివిజన్ యూత్ ఆధ్వర్యంలో పిఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం నస్పూర్ ఎస్సై ప్రశాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని, చెడు మార్గాల్లో పయనించకుండా మంచి మార్గంలో పయనించాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రీడాకారులు అందరూ క్రీడల్లో రాణించాలన్నారు. ఈ టోర్నీలో మొత్తం 38 టైమ్స్ తలపడుతున్నాయని టోర్నీ నిర్వాహకులు సాగర్ తెలిపారు. సహ నిర్వాహకులు హరీష్, భాను క్రీడాకారులు పాల్గొన్నారు.



# బాలికల ఆరోగ్యం, విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం



**కోటపల్లి, జనవరి 9 (ప్రభాత సమాచారం)** కోటపల్లి మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లావణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. బాలికల ఆరోగ్యం, విద్య రెండింటికి సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలు ఆరోగ్యవంతంగా ఉంటూ నాణ్యమైన విద్యను అభ్యసించినప్పుడే వారి జీవితంలో స్థిరత్వం, ఆత్మవిశ్వాసం పెరిగి, కుటుంబం సమాజ అభివృద్ధికి దోహదపడతారన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శారీరకంగా, మానసికంగా బలపడతారని, ఇది విద్యలో మెరుగైన ఫలితాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యార్థినులు రోజువారీ ఆహారంలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండే భోజనం తీసుకోవాలని సూచించారు. నియమిత వైద్య పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో పరిష్కరించుకోవచ్చన్నారు. సంక్రాంతి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, పాఠశాలలు పునఃప్రారంభమైన రోజునే విద్యార్థినులను తప్పని సరిగా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. నిరంతర విద్యాభ్యాసం ద్వారానే ఉన్నత చదువులు, మంచి ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని అన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, ఆరోగ్య పరీక్షలు, వసతుల వివరాలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధునయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ఆసిఫాబాద్‌లో
# ఘోర రోడ్డు ప్రమాదం

**ఆసిఫాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లాలోని బాబాపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ఎడ్లబండిని బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తదిమ్మిడి గూడ గ్రామానికి చెందిన టేకం పోచయ్య, ఆత్రం అనిల్, ఆత్రం లచ్చు అనే ముగ్గురు తిర్యాణి మండలంలోని దంతెన్పల్లి దైవదర్శనానికి వెళ్లి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బాబాపూర్--గంటలగూడ మధ్యలో ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని బైక్ ఢీకొనడంతో టేకం పోచయ్య, ఆత్రం అనిల్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు.

**దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం...**

ఈ ప్రమాదంలో ఆత్రం లచ్చుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే అతడిని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ దాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇంత పెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి చికిత్స అందించకుండా రిఫర్ చేయడంపై మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల ప్రాణాలతో వైద్యులు, సిబ్బంది చెలగాటం ఆడుతున్నారని ఆరోపిస్తూ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. కొంతసేపు దాడికి కూడా యత్నించడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## టీపీసీసీ చీఫ్ గౌడ్‌ను కలిసిన
# డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

**ఆసిఫాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** శుక్రవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున గౌడ్‌కు శాలువాతో సన్మానం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతం, పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజాసమస్యల పరిష్కారంపై చర్చించారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లేందుకు సహకారం అందించాలని సుగుణక్క కోరగా, మహేష్ కుమార్ గౌడ్ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.





# బీఆర్ఎస్ సర్పంచుల ఆత్మీయ సమ్మేళనం

**నిర్మల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్లకు ఉపసర్పంచ్‌లకు వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా సమన్వయకర్త పి.రామ్ కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం చేసి పూల బొకేలను అందించారు. వచ్చే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలిపించుకునేందుకు కష్టపడి పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భూషణ్ రెడ్డి, రాము, పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలి

**తాండూర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** గ్రామ పంచాయతీ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి శ్రీరాములు అన్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని చౌటపల్లి గ్రామ సర్పంచ్ తోపాటు వార్డు సభ్యులను శుక్రవారం ఆమె సన్మానించారు. సర్పంచ్ ముదాం సునీత, ఉపసర్పంచ్ గంగాధర లక్ష్మణ్, వార్డు సభ్యులు కోట భాగ్యలక్ష్మి, జూపాక శృతి, బొర్లకుంట రవీనా, అక్కపల్లి జీవన్ కుమార్, దుండ్రా రాజేష్, అర్జకూడ అంజి, సిడాం జ్యోతిలను పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరారు.




# ఒకే వేతనాన్ని ఇవ్వాలి



**దండేపల్లి, జనవరి 9 (ప్రభాత సమాచారం)** దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అర్చకులు అందరికీ ఒకే వేతనాన్ని అమలు చేయాలని దేవాదాయ శాఖ అర్చకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దండేపల్లి మండలంలోని గూడెం దేవాలయ ఆవరణలో అర్చక ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. అర్చకులకు కనీస వేతనమిస్తూ ఉద్యోగ భద్రత కల్పించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు ఉన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**జన్నారం, జనవరి 9 (ప్రభాత సమాచారం)** జన్నారం మండలంలోని చింతగూడ, మొహమదాబాద్ అటవీ ప్రాంతాలలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎఫ్‌డీవో రామ్మోహన్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం చింతగూడా అటవీ ప్రాంతంలో పెద్దపులి అరుపులు, మహమ్మదాబాద్ అటవీ ప్రాంతంలో పాదముద్రలను గుర్తించినట్లు ఆయన తెలిపారు.

# బంజారా యువజన సంఘం అధ్యక్షుడిగా ఆడె సతీష్


**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షునిగా ఆడె సతీష్కుమార్ (బొందిడి, నేరడిగొండ), ప్రధాన కార్యదర్శిగా జాదవ్ శ్యాం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్ శుక్రవారం వారికి హైదరాబాద్లో నియామక పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, జాదవ్ శ్రీనివాస్, చౌహాన్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



# 17 ఏళ్ల క్రితం తప్పిపోయి.. నేడు ఇంటికి చేరి



**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** 17 ఏళ్ల క్రితం తప్పిపోయిన ఓ యువకుడు.. ఎట్టకేలకు కుటుంబ సభ్యుల వద్దకు చేరాడు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణం ఖానాపూర్ కాలనీలోని అబ్బుల్లా కూడలి ప్రాంతానికి చెందిన షేక్ రఫీక్(25) మానసిక స్థితి సరిగ్గా లేకపోవటంతో 25 ఏళ్ల వయసులో ఇంటి నుంచి వెళ్లి పోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసం పలు చోట్ల గాలించినా ఫలితం లేకుండా పోయింది. అయితే అతను విశాఖలోని వీధుల్లో మతిస్థిమితం లేకుండా అనాథగా తిరుగుతుండటంతో ఏయూటీడీ(అసోసియేషన్ ఫర్ అర్బన్ అండ్ ట్రైబల్ డెవలప్మెంట్) స్వచ్ఛంద సంస్థ గుర్తించి చేరదీసింది. అనంతరం మహారాష్ట్ర, ముంబయిలోని శ్రద్ధావన్ పునరావాసం వారికి అప్పగించారు. అక్కడ చికిత్సలు అందించిన అనంతరం నాగ్పూర్లోని అశోకవన్లో ఉన్న శ్రద్ధావన్ పునరావాస కేంద్రానికి తరలించింది. పునరావాసం కేంద్రం నిర్వాహకులు ఆ వ్యక్తిని ఆసుపత్రిలో చేర్చగా అతను స్కిజోఫ్రెనియా అనే మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆసుపత్రిలో చికిత్సలు అందించగా అతని మానసిక స్థితి సాధారణ స్థాయికి రాగా కుటుంబ వివరాలు తెలిపాడు. దీంతో పునరావాస కేంద్రం ప్రతినిధి రాజేశ్కుమార్ మౌర్య.. షేక్ రఫీకు శుక్రవారం ఆదిలాబాద్కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. 17 ఏళ్ల క్రితం తప్పిపోయిన సోదరుడు ఇంటికి చేరటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రం ప్రతినిధి రాజేశ్కుమార్ మౌర్యకు కృతజ్ఞతలు తెలిపారు.



# పుర పీఠాలపై.. నజర్!

■ నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లో మొదలైన పుర రాజకీయం ■ వార్డుల్లో అభ్యర్థుల 'స్టంట్లు'.. ■ ఇంటింటికీ తిరుగుతున్న ఆశావహులు

■ పంచాయతీ జోష్‌లో బీజేపీ, అధికార బలంతో కాంగ్రెస్ వ్యూహాలు ■ సత్తా చాటేందుకు బీఆర్ఎస్.. ■ పట్టు కోసం ఎంఐఎం ఆరాటం

ఫిబ్రవరిలో మున్సిపల్ పోరు ఉంటుందన్న నేపథ్యంలో, బల్దియా ఎన్నికల పోటీలకు ప్రధాన పార్టీలు సన్నదమవుతున్నాయి. ఇప్పటికే స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్లెలో పంచాయతీ ఎన్నికలు ముగియగా.. ఇక పట్టణలలో మున్సిపల్ ఎన్నికల రాజకీయ రాజీ రాజుకుంది. ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితా రావడంతో పట్టణంలో రాజకీయాల హంగామా మొదలైంది. అయితే నిర్మల్ జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ పోల్ లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు అయినటువంటి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించుకుంటు న్నాయి. మరోపక్క కొందరు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే అభ్యర్థులు, పక్క రాష్ట్రమైనటువంటి మహారాష్ట్రలో ఫామ్‌లో ఉన్నటువంటి శిండే శివసేన పార్టీ బి ఫామ్‌లు తీసుకొచ్చే యోచనలో ఉన్నారు. గత నెలలో పూర్తయిన పంచాయతీ ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలు మున్సిపల్ పోరుకు సన్నదమవుతున్నాయి. జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా సర్పంచ్ స్థానాలు గెలిపించుకోగా బీ.ఆర్.ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం లోనే కొంత మేరకు ప్రభావం చూపగలిగింది. ఈ ఫలితాల ఆధారంగా ఆయా పార్టీలు మున్సిపాలిటీల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న లెక్కలు వేసుకుంటున్నాయి.

**ముథోల్, జనవరి 8 (ప్రభాత సమాచారం)** ఫిబ్రవరిలో మున్సిపల్ పోరు ఉంటుందన్న నేపథ్యంలో, బల్దియా ఎన్నికల పోటీలకు ప్రధాన పార్టీలు సన్నదమవుతున్నాయి. ఇప్పటికే స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్లెలో పంచాయతీ ఎన్నికలు ముగియగా.. ఇక పట్టణలలో మున్సిపల్ ఎన్నికల రాజకీయ రాజీ రాజుకుంది. ఇప్పటికే ఓటరు ముసాయిదా జాబితా రావడంతో పట్టణంలో రాజకీయాల హంగామా మొదలైంది. అయితే నిర్మల్ జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ పోల్ లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు అయినటువంటి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించుకుంటు న్నాయి. మరోపక్క కొందరు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే అభ్యర్థులు, పక్క రాష్ట్రమైనటువంటి మహారాష్ట్రలో ఫామ్‌లో ఉన్నటువంటి శిండే శివసేన పార్టీ బి ఫామ్‌లు తీసుకొచ్చే యోచనలో ఉన్నారు. గత నెలలో పూర్తయిన పంచాయతీ ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలు మున్సిపల్ పోరుకు సన్నదమవుతున్నాయి. జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా సర్పంచ్ స్థానాలు గెలిపించుకోగా బీ.ఆర్.ఎస్ ఖానాపూర్ నియోజకవర్గం లోనే కొంత మేరకు ప్రభావం చూపగలిగింది. ఈ ఫలితాల ఆధారంగా ఆయా పార్టీలు మున్సిపాలిటీల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న లెక్కలు వేసుకుంటున్నాయి.

**మున్సిపాలిటీల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ఫోకస్..**

నిర్మల్‌తో పాటు భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టణాల్లో సైతం గెలుపే లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ ఇటీవల జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నివాసంలో మున్సిపల్ ఎన్నికల పై చర్చించగా, ఈ మీటింగ్ లో కాంగ్రెస్ ప్రతీ కార్యకర్త మున్సిపాలిటీల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశ నిర్దేశం చేసినట్లుగా తెలిసింది. ఈ మేరకు తాలూకా ఇన్చార్జిలు పటిష్టంగా పనిచేసి, బల్దియాలపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. నిర్మల్,ముథోల్ నియోజకవర్గాల్లో స్థానిక ఫలితాల్లో పార్టీకి కొంత తక్కువ స్థానాలు రావడంతో జిల్లా కేంద్రంతో పాటు భైంసా పై కాంగ్రెస్ అధిష్టానం సీరియస్‌గా దృష్టి పెట్టాలని యోచన చేస్తున్నట్లు తెలిసింది.

**పంచాయతీ ఫలితాలను మున్సిపాలిటీలలో నిలపాలని చూస్తున్న బీజేపీ**

ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నిర్మల్,ముథోల్ తాలూకా లో బీజేపీ ఎన్నడూ లేనివిధంగా గణనీయంగా సర్పంచులను గెలుచుకుంది. ప్రస్తుతం ఇవే ఫలితాలను పట్టణ మున్సిపాలిటీలను సైతం కైవసం చేసుకోవాలని ఆరాటపడుతోంది. ప్రస్తుతం నిర్మల్,ముథోల్ తాలూకా ఎమ్మెల్యేలుగా బిజెపి అభ్యర్థులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి,పవర్ రామారావు పటేల్ కొనసాగగా,ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎం.పీ గోడెం నాగేష్ సైతం బిజెపినే. ఈ అవకాశాలన్ని బిజెపి బల్దియా పీఠాలు దక్కించుకోవడానికి ఉపయోగపడతాయని లెక్కలు వేసుకుంటుంది. గతంలో 26 వార్డులున్న భైంసా మున్సిపాలిటీలో తొమ్మిది వార్డు కౌన్సిలర్ స్థానాలను కైవసం చేసుకున్న బిజెపి,ఈసారి ఎలాగైనా మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**గత వైభవం కోసం బీఆర్ఎస్..**

ఈ సారి జిల్లాలోని మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు బీఆర్ఎస్ బలంగానే ప్రయత్నిస్తోంది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి జాన్సన్నాయక్ క్రియాశీలకంగా పనిచేస్తుండటంతో చెప్పుకోదగ్గ సర్పంచ్ స్థానాలను ఆ పార్టీ దక్కించుకుంది. నిర్మల్, ఖానాపూర్ తో పాటు,పొత్తులు పెట్టుకోనైనా భైంసాను గెలుస్తామన్న ఆశాభావంతో బీఆర్ఎస్ నేతలు పురపోరుకు సన్నద్ధమవుతున్నారు.

**గెలుపే లక్ష్యంగా, బల్దియాల కైవసం కోసం ఎంఐఎం దృష్టి..**

గత మున్సిపల్ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను బేరీజు వేసుకుని, వాటిని అధిగమిస్తూ, జిల్లాలోని బల్దియాలో మరింత బలపడేందుకు ఎం.ఐ.ఎం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. గత కొన్ని దఫాలుగా భైంసా పుర పోరులో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటున్న ఎంఐఎం ఈసారి దఫా లో సైతం గెలుపు ప్రయత్నంగా లెక్కలు వేసుకుంటుంది. అయితే నిర్మల్, ఖానాపూర్ బల్దియాలో సైతం అత్యధిక సీట్లు రాబట్టుకోవడం పై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

**ఇండిపెండెంట్‌గా రాణించాలని కొందరు..**

పలు పార్టీలలో పోటీ చేసే నాయకులు అధికంగా ఉన్న నేపథ్యంలో, తమకు పోటీ చేయడానికి అవకాశం రాని యెడల ఇండిపెండెంట్‌గా నైనా పోటీ చేయడానికి పలువురు పోటీ అభ్యర్థులు ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే భైంసా లాంటి ప్రాంతంలో కొందరు పోటీ అభ్యర్థులు మహారాష్ట్రలో పాపులర్ పార్టీ అయినటువంటి షిండే శివసేన పార్టీ బీ ఫాంలు తీసుకొచ్చి, పోటీ చేయాలని యోచనలో ఉన్నారు. ఏదేమైనా ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించుకుంటూ ముందుకు సాగుతున్నాయి. వార్డులలో ఇప్పటికే పోటీ నాయకుల స్టంట్స్ ఫిబ్రవరి మొదటి వారంలో మున్సిపల్ ఎలక్షన్స్ పోరు ఉంటుందన్న నేపథ్యంలో,ఇప్పటికే పోటీ అభ్యర్థులు వార్డులలో తమ స్టంట్లు మొదలుపెట్టారు. తాము పోటీ చేయాలనుకునే వార్డులలో ప్రజలని కలుస్తూ, వార్డులలో నెలకొన్న సమస్యలను నిర్మూలించే పనిలో పడ్డారు.

## మెస్రం అల్లుళ్ల సంరక్షణలో పవిత్ర గంగా జలం

### జైనూర్ మండలం గౌరీలో పచ్చని చెట్టుపై భద్రం

**ఇంద్రవెల్లి, జనవరి 8 (ప్రభాత సమాచారం)**

దేశంలో ఆదివాసులు జరుపుకునే జాతరలో రెండో అతిపెద్ద జాతరగా, రాష్ట్ర పండుగ గుర్తింపు పొందిన నాగోబా అభిషేకానికి అవసరమయ్యే పవిత్ర గంగా జలాన్ని భద్రపరిచే బాధ్యత మెస్రం వంశ అల్లుళ్లదే. డిసెంబర్ 30న కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం నుంచి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామ శివారులో ప్రవహించే గోదావరికి మెస్రం వంశీయులు కాలినడకన చేరుకున్నారు. మహాపాదయాత్రగా వెళ్లిన మెస్రం వంశపు పెద్దలు ఈనెల 7న గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి పవిత్ర గంగా జలాన్ని సేకరించారు. ఆ జలంతో శుక్రవారం ఉదయం 8 గంటల వరకు మహాపా దయాత్రగా కుమ్రం భీం జిల్లా జైనూర్ మండలం గౌరీ గ్రామ శివారులోకి చేరుకున్నారు. ఇంద్రవెల్లి మండలం వడగావ్ గ్రామానికి చెందిన మెస్రం వంశ అల్లుళ్లు ఆత్రం సాయికిరణ్, ఆత్రం మాధవరావు, కేస్లాపూర్‌కు చెందిన కొచ్చడ గన్ను కలిసి ఆ పవిత్ర గంగా జలాన్ని చెట్టు కొమ్మలపై భద్రపరిచారు. అనంతరం మెస్రం వంశ పెద్దలు గంగా జలానికి మొక్కి.. ఉమ్మడి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందినవారు ఇండ్లకు పయనమయ్యారు. ఈ నెల 13న ఎడ్లబండ్లతో గౌరీ గ్రామానికి చేరుకొని కేస్లాపూర్‌కు పయనమవుతారు. 14న ఇంద్రవెల్లిలోని ఆదివాసుల దేవత ఇంద్రాయకి మొక్కులు చెల్లించి, అదే రోజు రాత్రికి కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయ పరిసర ప్రాంతంలోని మర్రి చెట్ల వద్దకు చేరుకుంటారు.



# బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, బాలల హక్కులను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, బాలల సంక్షమ కమిషన్ చైర్మన్ మహమ్మద్ వహీద్ లతో కలిసి సంక్షమ శాఖల అధికారులు, పోలీసు, కార్మిక, విద్య, వైద్య-ఆరోగ్య, పౌర సంబంధాల శాఖల అధికారులతో ఆపరేషన్ స్మైల్ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడి వారికి మంచి భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. బడి బయట పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. కార్మిక శాఖల అధికారులు బృంద సభ్యులతో కలిసి పరిశ్రమలు, దుకాణాలు, నిర్మాణ ప్రాంతాలు ఇతర ప్రదేశాలను సందర్శించి బాల కార్మికులను గుర్తించాలని తెలిపారు. 14 సం?లలోపు వయసు కలిగి బాల కార్మికులు పని చేస్తున్నట్లుగా గుర్తించినట్లయితే సంబంధిత సంస్థల యాజమాన్యంపై కేసులు నమోదు చేసి, బాధిత బాలలకు నష్టపరిహారం అందించాలని తెలిపారు. బాల్యవివాహాలను నిర్మూలించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. గుర్తించబడిన బాల కార్మికులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నట్లయితే వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు జిల్లాలో ఆపరేషన్ స్మైల్ నిర్వహించడం జరుగుతుందని, ఇటుక బట్టీలలో పనిచేసే వారి పిల్లలను పాఠశాలలో చేర్పించడం, అవసరమైన పుస్తకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దుర్గాప్రసాద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా మైనార్టీ సంక్షమ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, బాలల పరిరక్షణ కమిటీ అధికారి ఆనంద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.





# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

**భీమారం, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

సైబర్ నేరాలపై అందరు అవగాహన కలిగి ఉండాలని భీమారం ఎస్సై శ్వేత సూచించారు. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో శుక్ర వారం మంచిర్యాల జిల్లా భీమారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినీలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చే తెలియని లింకులు లేదా ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని, ఎవరికీ ఓటీపీ వివరాలు ఇవ్వకూడదని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. సోషల్ మీడియాను బాధ్యతతో వినియోగించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినీలకు సైబర్ మోసాలు, ఓటీపీ మోసాలు, ఏపీకే (ఙ్రాఖ) ఫైళ్ల వల్ల కలిగే ప్రమాదాలు, సామాజిక మాధ్యమాల ప్రభావం, పిల్లలపై వేధింపులు, ఆత్మహత్య ఆలోచనలు, అలాగే విద్య ప్రాధాన్యత వంటి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

**సారంగాపూర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

సారంగాపూర్ మండలం చించోలి ఎంజీబీ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి రాధిక, రవాణా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, మోటార్ వెహికల్ యాక్ట్ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు : మచ్కల్ సర్పంచ్ ఆత్మస్వరుప్

**ముథోల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**



అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తామని మచ్కల్ సర్పంచ్ ఆత్మస్వరుప్ అన్నారు. ముథోల్ మండలంలోని మచ్కల్ గ్రామంలో శుక్రవారం మండల పంచాయతీ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల కు భూమి పూజ చేశారు. ఆనంతరం ఆమె మాట్లాడారు. గ్రామంలో మొదటి దశలో 25 ఇండ్లు మంజూరు అయ్యాయన్నారు. రెండు దశలో త్వరలో మరో 20 ఇండ్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారం తో మంజూరు చేయిస్తామని చెప్పారు. గ్రామంలో ఇండ్లు లేనివారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జీవాలకు టీకాలు వేయాలి

**ముథోల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**



గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి రవీందర్ అన్నారు. ముథోల్ మండలంలోని ముద్గల్ గ్రామంలో శుక్రవారం రోజు గొర్రెలు, మేకలకు మాశూచి వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాల కార్యక్రమం నిర్వహించారు. పెంపకం దారులు తప్పని సారిగా గొర్రెలు, మేకలకు టీకాలు వేయించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉచితంగా టీకాల కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ గణపతి, ఉపసర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

### అన్యాక్రాంతమైన

# భూములు స్వాధీనం

## అసలైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

పేదలు, గిరిజనులకు ప్రభుత్వం కేటాయించిన భూములను అక్రమంగా ఆక్రమించినా, తప్పుడు మార్గాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేరిట అక్రమంగా బదిలీ అయిన భూములను స్వాధీనం చేసుకుని, అసలైన లబ్ధిదారులకు కలెక్టర్ పట్టాలు అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంట గ్రామానికి చెందిన అడ్డురి రమణ బాయికు ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నంబర్ 83లో 1 ఎకరం 15 గుంటల భూమి కేటాయించగా, సదరు భూమిని మరొక వ్యక్తి చట్టవ్యతిరేకంగా తన పేరిట పట్టా చేసుకున్నాడు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన అధికారులు అక్రమ పట్టాను రద్దు చేసి, తిరిగి అడ్డురి రమణ బాయి పేరిట పట్టా జారీ చేశారు. అలాగే సిరికొండ మండలానికి చెందిన కుమరం జంగు బాపు (తండ్రి: సుంగు)కు చెందిన సర్వే నంబర్ 57/ఊ/1లోని 6 ఎకరాలు 18 గుంటల భూమిని పలువురు వ్యక్తులు మోసపూరితంగా తమ పేరిట పట్టా మార్చుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భూభారతి చట్టం కింద అప్పీల్ విచారణ చేపట్టి, అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేసి, తిరిగి కుమరం జంగు బాపుకు భూమి పట్టా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కలెక్టర్‌కు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన ఆర్డీఓ స్రవంతి, ఆదిలాబాద్ రూరల్, సిరికొండ తహశీల్దార్లు గోవింద్ నాయక్, తుకారాం లను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ఆయా మండలాల తహశీల్దార్లు, లబ్ధిదారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన

# నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని శుక్రవారం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. ఎల్లప్పుడు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జనవరి 9 (ప్రభాత సమాచారం)** మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, శ్రీనిధి రీజినల్ మేనేజర్ వెంకటరమణ లతో కలిసి శ్రీనిధి రుణాలు, బ్యాంకు లింకేజ్ ల మంజూరు, రికవరీల పై జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, సెర్ప్ ఆధ్వర్యంలోని శ్రీనిధి సిబ్బంది, సామాజిక సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అన్ని రంగాలలో రాణించేందుకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. జిల్లాలో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీనిధి రుణాల లక్ష్యం 42 కోట్ల రూపాయలకు గాను 46 శాతంతో 19 కోట్ల 47 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రికవరీలో భాగంగా 49 శాతం రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రికవరీ పరంగా 25వ స్థానంలో కొనసాగడం జరుగుతుందని, జిల్లాలో తక్కువ రికవరీ ఉన్న మండలాల ప్రతినిధులు రికవరీ శాతాన్ని పెంపొందించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకు లింకేజీ విషయంలో 422 కోట్ల రూపాయలకు గాను 311 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ చేయడం జరిగిందని, ఓవర్ డ్యూ 0.68 శాతంగా నమోదు అయిందని, ఈ క్రమంలో సమగ్రమైన ప్రణాళిక రూపొందించుకుని తక్కువ ప్రగతి సాధించిన మండలాలు వృద్ధి సాధించేలా కృషి చేయాలని తెలిపారు. బ్యాంకుల వద్ద నుంచి ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలాల వారిగా కమ్యూనిటీ కో- ఆర్డినేటర్ల పని తీరు పరిశీలించి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే కమ్యూనిటీ కో- ఆర్డినేటర్ల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాలోని నస్పూర్ లో గల సి.సి. కార్నర్ లో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ప్రారంభించడం జరుగుతుందని, ఇందులో మొదటి బ్యాచ్ లో ప్లంబింగ్, శానిటేషన్ పై నెల రోజుల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయసు గల గ్రామీణ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో డిమాండ్ ఎక్కువగా ఉన్న పనులకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# నిషేధిత చైనా మాంజా విక్రయించొద్దు

## ఎస్సై రామకృష్ణ

**జైనూర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** చైనా మాంజా గాలిపటాల దారాలు విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) ఎస్సై రామకృష్ణ హెచ్చరించారు. ఆసిఫాబాద్ ఎస్పీ, ఏఎస్పీల ఆదేశాల మేరకు ఎస్సై రామకృష్ణ పోలీసులతో కలిసి గురువారం ఉదయం మండల కేంద్రంలోని కిరాణా, జనరల్ స్టోర్లను తనిఖీ చేశారు. గాలిపటాలకు వాడే చైనా మాంజా దారాల వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఎవరూ కూడా చైనా మాంజా దారాలను విక్రయించకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

# పకృతి పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన

**నిర్మల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలోని బుధవార్పేట్ శిశు మందిర్ విద్యార్థులు పకృతి పర్యావరణం మొక్కల పరిరక్షణ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను పర్యాటకులకు వివరించినట్టు ప్రధాన ఉపాధ్యాయులు నరేష్ తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని అలీసాగర్ ఇతర పర్యాటక ప్రదేశాలకు వెళ్లి పకృతి పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజలను మభ్య పెట్టేందుకే శంకుస్థాపనలు

**ఆసిఫాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)** ఎలాంటి అధికారిక హోదా లేని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ శ్యామ్ నాయక్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్, మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరిట ప్రారంభోత్సవాలు చేస్తూ ఆర్భాటం చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు కూడా సమాచారం ఇవ్వకుండా, ప్రోటోకాల్ లేని వ్యక్తులతో హడావిడిగా శంకుస్థాపనలు చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత పనులకు మున్సిపాలిటీ వద్ద ప్రస్తుతం ఎలాంటి నిధులు లేవని, అలాగే ఎలాంటి సాంక్షన్లు లేదా



అధికారిక ప్రొసీడింగ్స్ కూడా లేవని మున్సిపల్ కమిషనర్ స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు వెంకన్న, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్ నాయకులు సయ్యద్ నిస్సార్, దుడేలా అశోక్, చౌదరి రవి, జావేద్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



# నిషేధిత చైనా మాంజాపై పోలీస్ పంజా

## విస్తృతంగా దుకాణాల్లో తనిఖీలు

**బెల్లంపల్లి, జనవరి 9 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు ఈసారి చైనా మాంజా వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గాలిపటాలకు వినియోగించే మాంజాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేక ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ భాస్కర్ నేతృత్వంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో మందమర్రి, కాసిపేట, తాండూర్, నేన్నెల, కన్నెపల్లి, భీమిని,వేమనపల్లి మండలాల్లో చైనా మాంజా వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రధాన పట్టణంలో గాలిపటాల దుకాణాల ను తనిఖీలు చేశారు. దుకాణదారులకు చైనా మాంజాను విక్రయించరాదని అవగాహన కల్పించారు. చైనా మాంజా ప్రాణాంతకమైందని ప్రచారం చేస్తున్నారు. చైనా మాంజా మినహించి ఇతర ఏమాంజనైనా గాలిపటాలకు వినియోగించుకోవచ్చని పోలీసులు చెబుతున్నారు. దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన తనిఖీలు చేస్తున్నారు. బెల్లంపల్లిలో సీఐ శ్రీనివాసరావు, టూ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్, తాండూర్‌లో సిఐ దేవయ్య, దేవపూర్‌లో ఎస్సై గంగారం, మందమర్రి సర్కిల్‌లో ఎస్ఐ రాజశేఖర్ మాంజా దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారు. చైనా మాంజా వినియోగంపై పోలీసులు చేపట్టిన అవగాహన కార్యక్రమం ఫలప్రదం అయిందని చెప్పొచ్చు. ఈ దఫా సంక్రాంతి పండుగ సందర్భంలో గాలిపటాలకు చైనా మాంజాను ఎవరూ వినియోగించడం లేదు. గాలిపటాలు ఎగురవేసే ఉత్సాహంలో ప్రజలు, ముఖ్యంగా యువత తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేయవద్దని పోలీసులు మోటివేషన్ చేస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నిషేధిత చైనా మాంజా (నైలాన్/సింథటిక్ దారం) వాడకంపై కఠినంగా వ్యవహరిస్తామని దుకాణదారులకు సూచించారు.

# బానయ్య కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

**రెబ్బెన, జనవరి 9 (ప్రభాత సమాచారం)** మండలంలోని గోలేటి గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న చిర్ర బానయ్య విధి నిర్వహణలో ఉండగా అకస్మాత్తుగా మరణించారు. ఈ సంఘటనపై గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మరణించిన బానయ్య కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. అలాగే, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాయిల్లా నర్సయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్



మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్, కార్యదర్శి రత్నం దేవాజీ, జిల్లా నాయకులు సుధాకర్, బాబాజీ, సిబ్బంది భీమయ్య, బాలయ్య, లక్ష్మ, ఎల్లమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల సమన్వయంతో నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

జిల్లా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం పెద్ద ఎత్తున నిర్మల్ ఉత్సవాల్లో పాల్గొనే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. నిర్మల్ జిల్లా చరిత్ర తెలియజెప్పేలా కార్యక్రమాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈ నెల 19 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించబోయే నిర్మల్ ఉత్సవాల కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటిస్తూ, ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానించాలని చెప్పారు. సంతకాల బోర్డు, సెల్ఫీ పాయింట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజల నుంచి స్వీకరించిన సూచనలను పరిశీలించారు. ఉత్సవాలకు వచ్చే సందర్శకుల సంఖ్యను ముందుగా అంచనా వేస్తూ, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సిపిఓ జీవరత్నం, డిపిఓ శ్రీనివాస్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఎంహెచ్ఓ రాజేందర్, అగ్నిమాపక అధికారి శివాజీ, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





### ఇందిరమ్మ ఇండ్ల పనులు

# వేగవంతం చేయాలి

**బెజ్జూర్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

బెజ్జూర్ మండలంలోని మొగవెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మాజీ సర్పంచ్ కొడప లక్ష్మ భూమి పూజ చేశారు. సర్పంచ్ కడప శంకర్ ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ కడప లక్ష్మ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఏప్రిల్ నెలలో రెండవ విడత ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 12న జిల్లాకు డిప్యూటీ సీఎం భట్టి రాక

**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈనెల 12వ తేదీన జిల్లా పర్యటించే అవకాశం ఉందని జిల్లా అధికార వర్గాలు తెలిపాయి. డిప్యూటీ సీఎం జిల్లా పర్యటన ఖరారు కానున్న నేపథ్యంలో శుక్రవారం ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మట్, డిఆర్డిఓ పిడి రాథోడ్ రవీందర్, ఇతర అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. డిప్యూటీ సీఎం పర్యటలో ఆయా శాఖలకు అప్పగించిన పనులను ఈనెల 13 లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఐటిడిఏ డిడి జాదవ్ అంబాజీ పాల్గొన్నారు.

# అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

**పెంచికల్‌పేట్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**



అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఎలుక పల్లి సర్పంచ్ భక్తురాంచందర్ అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీలో మొదటి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పలు సమస్యలను గ్రామసభలో ప్రస్తావించగా సర్పంచ్ స్పందించి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిల్ కార్యదర్శి చంద్రశేఖర్ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ



**ఆదిలాబాద్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం 2026 డైరీ, క్యాలెండర్‌లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, అధ్యక్షులు నగేష్ రెడ్డి, జనరల్ సెక్రటరీ భగత్ రమేశ్, ట్రెజరర్ అసురి రవీంద్ర, శ్రీనివాస్, శ్రీకర్, శివకుమార్ ఏవోలు అష్రఫ్ శ్రీనివాస్, సయిదా పాల్గొన్నారు.



### చించోలి (బి)పాఠశాల విద్యార్థులకు

# బూట్లు, సాక్స్ పంపిణీ

**నిర్మల్, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

వాసవి ఎడ్యు, ఇన్నోవేటివ్ ట్రస్ట్ నిర్మల్ వారి సౌజన్యంతో సారంగాపూర్ మండలంలోని చించోలి 'బి' ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బూట్లు, సాక్స్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ తరపున పాల్గొన్న సభ్యులు జగదీశ్ రెడ్డి, పోతారెడ్డిలు విద్యార్థులకు ఉచితంగా బూట్లు, సాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు షబ్బీర్ అలీ అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు రజని ,విజయ, రవీందర్ లతో పాటు పాఠశాల విద్యార్థులు, విద్యార్థినీ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవి ట్రస్ట్ సభ్యులు పోతారెడ్డి మాట్లాడుతూ తమ వాసవి ట్రస్ట్ ఎంతో కాలంగా విద్యా విషయక కార్యక్రమాలతో పాటు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో పేద విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షబ్బీర్ అలీ మాట్లాడుతూ వాసవి ట్రస్ట్ వారు ఇలాంటి సామాజిక కార్యక్రమాలను చేపట్టడం ఎంతో ఆనందదాయకమన్నారు. చించోలి (బి) ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లు, సాక్స్ అందజేయడం పట్ల వాసవి ట్రస్ట్ వారిని ఈ సందర్భంగా అభినందించారు.



# పేదలకు అండగా జిల్లా యంత్రాంగం





## దుప్పట్లను పంపిణీ చేసిన కలెక్టర్ రాజర్షి షా

**బేల, జనవరి 9 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని నిరుపేదలకు, అవసరార్థులకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బేల మండలంలోని భవానీగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, పేదలకు చలి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. చలికాలంలో తమ అవసరాలను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేసినందుకు కలెక్టర్‌కు, అధికారులకు ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, తహసీల్దార్ రఘునాథ్ రావు, ఎంపీడీవో ఆంజనేయులు, సర్పంచ్ సునీత, పంచాయతీ కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.